


# స్త్రీ ÷ స్త్రీ

యండమూరి వీరేంద్రనాథ్

"నమస్తే. నా పేరు సరోజ" అందామె చేతులు జోడించి.

సత్యవతి ఆమె వైపు ప్రశ్నార్థకంగా చూసింది.

"మీ ఇంట్లో అద్దెకి పోర్షనుందని. . ." అప్పు చేసింది ఆలోక్తిలో.

"రండి రండి" అంటూ బయటకు నడిచింది సత్యవతి. ముందున్న బంతి పూల మొక్కల మధ్య నుంచి పక్క పోర్షన్ వైపు దారి తీసి, వేసున్న గొళ్ళాన్ని తొలగించి లోపలికి ప్రవేశించింది.

"మూడు గదులు, చివరిది వంటిల్లు, పెరట్లో పంపు ఉంది."

"అద్దెంత?" సరోజ అడిగింది.

"నూట ఇరవై, కరెంట్ కాక."

"నాకు నచ్చిందండీ. రేపే చేరిపోతాను" అంది సరోజ.

సరోజ కొంగు పట్టుకుని నిలబడ్డ మూడేళ్ళ బాబు చుట్టూ చూస్తున్నాడు. బయట సంభాషణ విని లోపల్నుంచి సత్యవతి భర్త సుధాకరం బయట కొచ్చి, ఇద్దర్నీ చూసి, లోపలకు వెళ్ళాడు.

సరోజ బాబునొయ్య విడిచి, హాండ్ బాగ్‌లో నొయ్య పెట్టి "ఒక నెల అడ్వాన్సు ఇవ్వనా?" అంది.

"ఇవ్వండి" అంది సత్యవతి. సరోజ డబ్బు తీస్తూంటే "మీ బాబా?" అని అడిగింది.

"అవునండీ."

"ఒకడేనా?"

"ఒకడే" ఈ సమాధానంతో సత్యవతి సంతృప్తి పడింది. "ఎంత తక్కువ మందుంటే ఇల్లంత బాగుంటుంది. మొత్తం ముగ్గురేనా ఉండేది?" అని లాంఛనంగా అడిగినట్టు అడిగింది.

"కాదండీ, ఇద్దరమే".

సత్యవతి ఉలిక్కి పడి "ఇద్దరేనా" అంది సరోజ వైపు పరీక్షగా చూస్తూ "... అంటే మీ వారు . . ."

"లేరు." ఆమె నెమ్మదిగా అంది.

"అయ్యో పాపం." నొచ్చుకుంది. "ఎంత కాలం అయింది?" అంది సరోజ నుదుటి కేసి చూస్తూ. ఎర్రటి తిలకపు బొట్టు అక్కడ మెరుస్తూంది. భర్త పోయి సంవత్సరమైనా తిరక్కు ముందే, తిరిగి బొట్టు పెట్టుకునే వాళ్ళు ఆమెకి కొత్త. అందుకే ఎంత కాలం అయింది అని అడిగింది.

"ఏమిటి ఎంత కాలం అయింది?"

"అదే. . . వారు పోయి. . ."

"పోవటం కాదు. అసల్లేరు" సరోజ జవాబిచ్చింది.

"అంటే. . . పెళ్ళి కాలేదా."

"ఊహూ. కాలేదు."

సత్యవతి అర్థం కానట్టు' 'ఈ బాబు?" అంది.

"నా కొడుకు."

దాదాపు వెయ్యి పౌన్ల సుత్తితో కొట్టినట్టు, తల దిమ్మెక్కింది సత్యవతికి. అదే టైమ్‌కి సుధాకరం తండ్రి ఆఫీసు నుంచి వచ్చాడు. సైకిల్ అరుగు మీద కెక్కించి లోపలికి వెళ్ళాడు. మళ్ళీ వచ్చి, సైకిల్ స్టాండ్ సరిగ్గా పడిందో లేదో చూశాడు.

". . . అంటే పెళ్ళి కాకుండా" ఈ మాట అడగటానికి సత్యవతి కడుపులో తిప్పినట్టయింది.

సరోజ వెంటనే జవాబు చెప్పలేదు. తల వంచుకుని నెమ్మదిగా ". . . ఔను" అంది.

"నీకు తల్లి తండ్రులున్నారా?"

మీ నుంచి నీ కి మారటాన్ని గమనించింది సరోజ. అయినా జవాబు చెప్పింది "ఉన్నారు."

"ఎక్కడ"

"ఈ వూళ్ళోనే."

"మరి వాళ్ళతోనే ఉండొచ్చుగా."

"గెంటేశారు." దీనంగా అనలేదామె. కానీ కంఠంలో విషాదం కనబడింది.

సత్యవతికి ఇంకేం అడగాలో అర్థం కాలేదు. ఇంత ఇంట్రెస్టింగ్‌గా ఉన్న ఈమెని అంత అర్థాంతరంలో వదలటం ఆమెకి ఇష్టం లేక పోయింది.

"ఎంత కాలం అయింది?"

"మూడు సంవత్సరాలా ఎనిమిది నెల అయింది."

మూడు సంవత్సరాలా రెండు నెలల వయసున్న బాబు ఇద్దరి మాటలూ వింటున్నాడు.

"మరింత కాలం. . ."

"గాంధీ స్ట్రీట్‌లో ఉండేవాళ్ళం. ఇల్లున్న వాళ్ళు చాలా మంచి వాళ్ళు. కానీ వాళ్ళు ఆ ఇల్లు అమ్మేస్తున్నారు. అందుకని మారాల్సి వచ్చింది" అంటూ హ్యాండ్ బాగ్ లోంచి డబ్బు తీసింది. "ఇదుగో నూట ఇరవై.

సత్యవతి పుచ్చుకోలేదు. "మా వాళ్ళని అడగాలి" అంది.

"మీ వారు వచ్చినట్టున్నారుగా, అడగండి"

నిజానికి అడిగేదేమీ లేదు. ఆ ఇంట్లో సత్యవతి మాటే మాట. కానీ ఎలా ఈమెని వదుల్చుకోవాలో తెలియక అలా అబద్ధం ఆడింది. ఇప్పుడిక ఏ సాకు చెప్పి తప్పించుకోవాలో తెలియ లేదు.. కానీ దాన్ని సరోజ గుర్తించినట్టు "మాకు అద్దె విషయంలో ఏ డోకా లేదండీ. నెల నెలా ఫస్టు తారీఖు కల్లా ఇచ్చేస్తాను. కావాలంటే ఒక నెల బదులు రెండు నెలల అద్దె అడ్వాన్సుగా ఇస్తాను.

దేవుడి దయవల్ల ఐదారొందల జీతం వచ్చే ఉద్యోగమే చేస్తున్నాను" అంది.

"అహ! అద్దె గురించి కాదు."

"మరి."

సత్యవతి వెంటనే జవాబు చెప్పలేక పోయింది. నిజానికి తన సమస్య ఏమిటో ఆమెకే అర్థం కావటం లేదు. ఇల్లు ఇవ్వటం మాత్రం ఇష్టం లేదు.

"ఏదైనా ఫామిలీకి ఇద్దామనుకుంటున్నాం" అంది.

సరోజ నవ్వి. "స్టేట్ గవర్నమెంట్ టి. ఏ. రూల్సు ప్రకారం మేం ఫామిలీ యే కదా."

ఆ నవ్వు సత్యవతికి ఉక్రోషం తెప్పించింది. . . . "గౌరవప్రదమైన ఫామిలీకి" అంది 'గౌరవప్రదమైన' అన్న పదాన్ని వత్తి పలుకుతూ.

సరోజ మొహం క్షణం పాటూ వాడిపోయింది. కానీ ఈ తిరస్కారాలు అలవాటవడం వల్ల, వెంటనే సర్దుకుని "మనిషి గౌరవప్రదంగా బతికేందుకీ, సామాజికంగా, 'ఒక్క క్షణం బలహీన మనస్తత్వానికీ' సంబంధం ఏమిటండీ? బలహీనతలన్నవి ఎవరి దగ్గరైనా ఉంటాయి" అన్నది.

తన పాయింట్ మీదే నిలబడి ఆరాగా చూసే సరోజని చూస్తే, ఆమెకి ఉక్రోషం ఎక్కువైంది. నిజానికి ఆమె ఇంటి కోసం కొంచెం దీనంగా బతిమాలుతుందేమో అనుకుంది. అందుకే చప్పున అనేసింది.

"అలాంటి బలహీనత ఉన్న వాళ్ళు మా పక్క పోర్షన్లో వద్దు."

ఈ మాటని సరోజ ముందే ఊహించినట్టుంది. అందుకే ఈ సారి ఆమె తమాయించుకుని, ఆవేశరహితంగా, నెమ్మదిగా అంది. "ఒకప్పటి బలహీనత అంటే అది. అప్పుడు లోకం గురించి అంతగా తెలీదు. ప్రేమకీ, మంగళసూత్రానికీ తేడా తెలీదు. అది ఒక విధంగా చూస్తే బలహీనతకూడా కాదు. మీకు తెలియనిదేముంది? ఇటువంటి విషయాల్లో మగవాడే డ్రైవ్ చేస్తాడు. స్త్రీని. గమ్యం చేరుకున్నాక గానీ, తన భవిష్యత్తు అగమ్యగోచరం అని స్త్రీ తెలుసుకోలేదు. కానీ అప్పటికే మూడో నెల. మీరన్నారు బలహీనత ఉన్న వాళ్ళు పక్క పోర్షన్లో వద్దని. నా కిప్పుడు ఏ బలహీనతలూ లేవండీ. ఉన్నా ఉంటే ఈ పాటికి మళ్ళీ" . . .

'శివశివా' అంటూ సత్యవతి చెవులు మూసుకోబోయి ఆగింది. సరోజ మామూలుగానే ఉంది. ఈ లోపులో బాబు చిటికెన వేలు చూపించి 'ఆన్నా' అన్నాడు.

"ఒక్క నిమిషం ఆగరా బాబూ" అంటూ సత్యవతి వైపు తిరిగింది.

"మీరు అనొచ్చు. ఇప్పుడు నాకు బాగా ఎక్స్‌పీరియన్సొచ్చింది కాబట్టి, అలాటి వేమీ రాకుండా జాగ్రత్త పడుతున్నానేమో అని. అంత ఆత్మవంచన చేసుకొనే మనస్తత్వమే ఉంటే, వీణ్ని నా కొడుకని చెప్పుకోకుండా, వీడు పుట్టగానే ఏ అనాథ శరణాలయంలో చేర్పించటమో చేసి ఉండేదాన్ని కదండీ. మీరూ స్త్రీ యే కదా! మీకు తెలియనిదేముంది? ఒకసారి మోసపోయిన స్త్రీ మరి జన్మలో పురుషుడిని దగ్గరకు రానివ్వదు. అవునా? ఇప్పుడు నాకు బలహీనత లేవీ లేవండీ" అంది. 'బలహీనత' అనే పదాన్ని వత్తి పలుకుతూ. "అలాటి వన్నీ పద్దెనిమిదో ఏట ఎర్రటి సంధ్య కలల్లోనూ, తొలి వయస్సు రాగ రంజిత రసానుబంధాల్లోనూ కరిగిపోయేయి వాటికి 'బలహీనతలు' అని మీరు పేరు పెడితే! ఇప్పుడు నా ఆశయమల్లా వీణ్ని పెద్దవాణ్ని చెయ్యటమే. థియరీ కన్నా ప్రాక్టీసు గొప్పది కావచ్చు. కానీ థియరీ థియరీయే కదా! పోనీ మీకు నంత అపనమ్మకమైతే ప్రతి రోజూ రాత్రి తొమ్మిదింటికల్లా మా ఇంటి ముందు తలుపుకి బైట తాళం వేసుకోండి. ఇంకే ముంటుంది మీకు కష్యంతరం? ఆ . అప్పట్ని మీకో అనుమానం రావచ్చు. మధ్యాహ్నం ఆఫీసుకని చెప్పి వెళ్ళి నే నెవరితోనైనా తిరగొచ్చు అని. ఆ ప్రాబబిలిటీ మీరు ఒక ఫామిలీ కిచ్చినా ఉంది కదండీ."

సత్యవతికి ఆకస్మాత్తుగా పొయ్యి మీద పెట్టిన పోపు జ్ఞాపకం వచ్చింది. దాని ఘాటు ఇక్కడివరకూ వచ్చి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నట్టు అయింది. ఇంత తెగించిన దాన్తో తనకి మాటలేమిటా అనుకొని, చేతులు జోడించి నమస్కారం చేస్తూ, "వెళ్ళిరా తల్లీ నువ్వు మంచిదానివే కావచ్చు. కానీ మా ఇంట్లో మొగాళ్ళున్నారు. వాళ్ళకి ఉండొచ్చు బలహీనతలు" అంది.

సరోజ నవ్వింది. విషాదమూ, జాలీ మిశ్రితమైన నవ్వు. నదిలో మునిగిపోతున్నవాడు గడ్డిపరకను పట్టుకుని ఈదుతున్న వాణ్ని చూసి నవ్విన నవ్వు.

"ఒప్పుకున్నారు కదా మీ మగవాళ్ళకి బలహీనత లున్నాయని. మరి ఒక 'బలహీనత లున్న స్త్రీ'ని పక్క పోర్షన్ లోకి రానివ్వటానికి ఇష్టపడని మీరు, ఒక బలహీనత లున్న పురుషుడి పక్కలో ఎలా రోజూ పడుకుంటున్నా రండీ?" నవ్వింది. "ఈ ఫ్రాంక్‌నెస్‌తో మీకు నే నో రాక్షసిలా కనబడుతున్నాను కదూ ..." చప్పున ఆమె కంఠం రుద్ధమైంది.

"నేనూ మీ లాగే అమాయకంగా కలల ప్రాంగణంలో ముగ్ధంగా, స్నిగ్ధంగా ఆడుకొనేదాన్నండీ! కన్ను మూసి తెరిచే లోగా అంతా అయిపోయింది. ఇందులో బలహీనత ఏమీ లేదు. అంతా మోసమే. మంగళసూత్రం కట్టలేదు కాబట్టి తనకేం సంబంధం లేనట్టు చూసే కొడుకూ, తనకి వ్యాయంచెయ్యమని అడగటానికొచ్చిన అమ్మాయిని మెడపట్టుకొని తోసేసిన మామగారూ—

సంపాదిస్తున్న కూతురు తప్పుచేసింది కాబట్టి 'మరీ ఎక్కువగా' తిట్టలేక ఎబార్షన్ చెయిస్తానన్న తండ్రీ — వీళ్ళు, వీళ్ళంతా కలిసి ఒక పద్దెనిమిదేళ్ళ అమ్మాయి ముగ్ధత్వాన్నీ, స్నిగ్ధత్వాన్నీ కాళ్ళ క్రింద నలిపేసేరు.

అప్పుడు నాకు బాధ వెయ్యలేదండీ.

చేసిన చిన్న తప్పుని ఒప్పుకొని ఇంత మంది మొగాళ్ళని ధైర్యంగా ఎదిరించి, స్వశక్తి మీద నిలబడి నిజాయితీగా తన కొడుకుని తాను పెంచుకొంటున్న ఒక అమ్మాయిని, స్త్రీ అయి ఉండీ మీరు మీ పక్క పోర్షన్ లోకి రానివ్వటం లేదంటే ఇప్పుడు ఇప్పుడు బాధగా ఉంది, అంతే.

నాకు ఇల్లక్కర్లేదండీ. మీరే ఇంట్లోంచి బైట కొచ్చి ప్రపంచాన్ని చూడండి. స్త్రీకి జరుగుతున్న అన్యాయానికి పరోక్షంగా దోహదం చేస్తున్నది స్త్రీయే అని తెలుస్తుంది. మొగవాళ్ళ ప్రపంచం నుంచి తన వాళ్ళని తొలగిస్తున్నది కూడా స్త్రీయే అనిపిస్తుంది"

ఆమె వెను దిరిగింది.

అమె వేలు పట్టుకొని బాబూ వెనుదిరిగేడు.

*

